క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ పథకం, వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగ సంఘాల నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. గ్రామీణాభివృద్ధి శాఖలో వివిధ హోదాల్లో దాదాపు 17 ఏళ్లుగా అంకితభావంతో పనిచేస్తున్న తమను క్రమబద్ధీకరించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో చర్చించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఏపీడీఓ శంకరనారాయణ, మృదుల, భానుప్రకాష్, మధు, వంశీ, వెంకటేశ్వర్లు, రామచంద్రయ్య, తదితరులు ఉన్నారు.

లవకుమార్ మృతికి సంతాపం



నెల్లూరు (టౌన్): జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లవకుమార్ సోమవారం మృతి చెందారు. ఆయన మృతికి ఉప రవాణా కమిషనర్ బీ చందర్‌తో పాటు కార్యాలయ సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. లవకుమార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఇన్‌చార్జి ఆర్టీఓ మురళీమోహన్, ఎంవీఐలు బాలమురళీకృష్ణ, కార్తీక్, ఏఎంవీఐలు పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, ఏఓలు కిషోర్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని గోమతినగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రామలింగాపురం విద్యుత్ ఫీడర్‌లో అదనపు(డీటీఆర్) ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నందున మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్ రెడ్డి సోమవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రామలింగాపురం, ముత్యాలపాళెం, టీడీపీ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

• నగరంలోని డీఆర్‌డీఏ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్‌కు నూతనంగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నందున మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కాకర్లవారివీధి, ఆచారివీధి, ట్రంక్‌రోడ్డు, పొగతోట, బృందావనం, సండేమార్కెట్, పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విగ్రహాల రంగులకు రూ.1.08 లక్షల విరాళం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానం ప్రాంగణంలోని అష్టాదశ శక్తి పీఠాల విగ్రహాలకు రంగులు వేసేందుకు దాత ఇనమడుగు నరేంద్రరెడ్డి సోమవారం రూ.1,08,000 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, సభ్యులు మల్లు రామమోహన్‌రెడ్డి, గూడంశెట్టి దొరబాబు, ఉపప్రధాన అర్చకుడు సంజీవరావు పాల్గొన్నారు.

సన్మానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): శాంతా బయోటెక్నిక్స్ చైర్మన్ కేఐ వరప్రసాద్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణంలోని రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన గురువుకు వందనం కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన వరప్రసాద్‌రెడ్డిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

నాడు-నేడు పనులపై ప్రత్యేక దృష్టి



గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

• కలెక్టర్ ఎం హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో మన బడి నాడు-నేడు రెండో విడత పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. నాడు-నేడు పనుల వారాంతపు ప్రగతిపై సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాలు, స్కూళ్ల వారీగా పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడత పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న మరుగుదొడ్లు, అదనపు గదులు, వంట గదులు, ప్రహరీల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. తరగతి గదుల మరమ్మతులు, ఫర్నిచర్, ఎలక్ట్రిఫికేషన్ పనులను సకాలంలో పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పూర్తి చేసిన పనులకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సుమారు రూ.16 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని, అధికారులు పనులు త్వరగా పూర్తి చేసి నిధులు ఖర్చు చేయాలని ఆదేశించారు. విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక కిట్లు అందేలా చూడాలని ఎంఈఓలను ఆదేశించారు. ఎంఈఓలు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రతిరోజూ పాఠశాలలను సందర్శించాలన్నారు. విద్యార్థుల హాజరుతో పాటు వారికి అందజేసిన నోటు పుస్తకాలు, వర్క్‌బుక్స్ వినియోగిస్తున్నారా.. లేదా..షెడ్యూల్ ప్రకారం ఉపాధ్యాయులు సిలబస్‌ను పూర్తి చేస్తున్నారా..లేదా పరిశీలించాలన్నారు. తొలుత డీఈఓ గంగాభవాని నాడు-నేడు పనుల పురోగతి, జగనన్న విద్యాకానుకల పంపిణీ, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు నమోదు, తదితర అంశాలపై ఎంఈఓలు, ఎంపీడీఓలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఎస్‌ఈలు రంగవరప్రసాద్, అశోక్ కుమార్‌ం ఐటీడీఏ పీఓ మందా రాణి, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ హనుమంతరావు, తదితరుల పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

పట్టణ ప్రాంతాల్లోని జగనన్న కాలనీ లేఅవుట్లలో చేపడుతున్న పేదల గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ మున్సిపల్ కమిషనర్లను, హౌసింగ్ ఇంజినీర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో పట్టణ గృహ నిర్మాణాల ప్రగతిపై జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్‌తో కలిసి కలెక్టర్ సోమవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లతో చర్చించి ఎక్కువ మంది మేస్త్రీలు, కూలీలు పనులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్టర్లు స్పందించకపోతే జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గృహ లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యేలా చూడాలని మెప్మా అధికారులను ఆదేశించారు. ఆత్మకూరు, కావలి మున్సిపాలిటీల పరిధిలో గృహ నిర్మాణాల ప్రగతి తక్కువగా ఉందన్నారు. పేదల గృహాలను తీసుకున్న కాంట్రాక్టర్లు నిర్మాణాలను ప్రారంభించకపోయినా, మధ్యలో నిలిపివేసిన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హౌసింగ్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నెల్లూరు, కందుకూరు, బుచ్చిరెడ్డిపాళెం పట్టణాల్లో గృహ నిర్మాణాల ప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేసి రాబోయే పదిహేను రోజుల్లో మంచి ప్రగతి సాధించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వికాస్‌మర్మత్, అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలి



స్పందన అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్ , మేయర్ స్రవంతి

• కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): స్పందన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని, సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని మేయర్ స్రవంతి, కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన వేదికలో కమిషనర్ పాల్గొన్నారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో భాగంగా ప్రజలు ఫోన్ ద్వారా విన్నవించిన సమస్యలను ఆలకించారు. వివిధ సమస్యలపై వచ్చిన 12 ఫిర్యాదులను సంబంధిత విభాగాధికారులకు తెలియజేసి గడువులోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. అనంతరం మేయర్‌తో కలిసి స్పందన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, 1902, స్పందన, ఏపీ సేవా పోర్టల్‌ను అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతిరోజూ పరిశీలించుకోవాలని, ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. సచివాలయ స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను సంబంధిత కార్యదర్శులు పరిష్కరించాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ సంబంధిత విభాగాధికారి, సచివాలయ కార్యదర్శి నేరుగా ఫిర్యాదుదారుని కలిసి శాశ్వత పరిష్కారం అందించి సమస్య పునరావృతం కాకుండా చూడాలన్నారు. అన్ని విభాగాల ఉన్నతాధికారులు తమ విభాగాల పని తీరు మెరుగుపరిచేందుకు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. వారంలో తమకు కేటాయించిన నాలుగు సచివాలయాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని ఆదేశించారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ



46వ డివిజన్‌లో విద్యా కానుకలను పంపిణీ చేస్తున్న వేలూరు మహేష్



వెంకటేశ్వరపురంలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను సోమవారం పంపిణీ చేశారు. 53వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ సుజాతఅశోక్ చేతుల మీదుగా 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 880 మంది విద్యార్థులకు కిట్లు అందజేశారు. పాఠశాల హెచ్ఎం మంజులవాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లూరు(సెంట్రల్): 46వ డివిజన్‌లోని మున్సిపల్ పాఠశాలలోని విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను స్థానిక కార్పొరేటర్ వేలూరు మహేష్ సోమవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ సాయిలక్ష్మితో కలిసి విద్యాకానుక కిట్లను అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాము, రోషన్, బాషా, సీహెచ్ సుబ్బారావు, ప్రభ, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీని కలిసిన ఏపీయూడబ్ల్యూజే నేతలు

నెల్లూరు(దర్గామిట్ట) /నెల్లూరు(క్రైమ్): కలెక్టర్ ఎం హరినారాయణన్, ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డిని ఏపీయూడబ్ల్యూజే నేతలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి పాత్రికేయుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీని ఇప్పించాలని, అర్హులైన జర్నలిస్టులకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి జర్నలిస్టులపై దాడులు జరిగిన సమయంలో నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు జర్నలిస్టులు తమ వంతు సహకారం అందించాలని ఎస్పీ కోరారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వీ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ మస్తాన్‌రెడ్డి, కోశాధికారి గడ్డం హనోక్, ఉపాధ్యక్షుడు దయాశంకర్, వెంకటసుబ్బయ్య, ఈసీ మెంబర్లు నరసింహులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, చందు, తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీకి బుద్ధుడి విగ్రహాన్ని అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నేతలు

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్ గాంధీగిరిజన కాలనీకు చెందిన మద్దెల బాబు కేన్సర్‌తో ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలు చెక్కు మంజూరైంది. నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు స్థానిక కార్పొరేటర్ దేవరకొండ సుజాతఅశోక్ మృతుడి భార్య సుందరికి సోమవారం నగదు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సుందరికి నగదు చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్

ఆర్యవైశ్య విద్యార్థులకు ఉచిత వసతి సౌకర్యం

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని శ్రీపాండురంగ అన్నదాన సమాజం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలను కల్పిస్తున్నట్లు ఆ సమాజం కార్యదర్శి చలువాది వెంకటేశ్వర్లు, హాస్టల్ కమిటీ చైర్మన్ వాయుగుండ్ల హజరత్తయ్య సోమవారం తెలిపారు. నగరంలోని విద్యా సంస్థల్లో 2023-2024 విద్యాసంవత్సరంలో ఆరోతరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులని చెప్పారు. శ్రీపాండురంగ అన్నదాన సమాజం కార్యాలయంలో ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 5నుంచి రాత్రి 8గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు. 25న అర్హులైన విద్యార్థుల తుది జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్య విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెప్టెంబరులో ఆప్త 15వ వార్షిక వేడుకలు

నెల్లూరు సిటీ: అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్(ఆప్త) 15వ వార్షిక వేడుకలను అమెరికాలోని అట్లాంటా మహానగరంలో సెప్టెంబర్ 1 నుంచి మూడ్రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్షుడు కొట్టే ఉదయ్‌భాస్కర్ తెలిపారు. నగరంలోని మినర్వాగ్రాండ్ హోటల్‌లో ఆప్త వార్షిక వేడుకల ఆహ్వానపత్రికలను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉదయ్‌భాస్కర్ మాట్లాడారు. అమెరికాలో నివసిస్తున్న తెలుగు ప్రజలకు చేయూతనందించేందుకు ఆప్తాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ అసోసియేషన్ విద్యార్థుల చదువుకు సహకారం అందించడంతో పాటు మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని వివరించారు. తెలుగు ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కారానికి తమ అసోసియేషన్ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో రాణిస్తున్న ప్రముఖులను వార్షిక వేడుకలకు ఆహ్వానించి సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడపాటి గోపాల్, గుడిసేవ విజయ్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉదయ్‌భాస్కర్

ఉద్యోగం పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): తనకు, తన అన్నకు వెలుగులో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.10లక్షలు నగదు తీసుకుని మోసగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు మండలానికి చెందిన నరసింహులు పోలీసు ఉన్నతాధికారులను కోరారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ తాను కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నానన్నారు. తనకు, తన అన్నకు ఉద్యోగం ఇప్పిస్తానని తన తల్లిని తెలిసిన వారైన కొమరిక రమణయ్య, సావిత్రి నమ్మించారన్నారు. దీంతో తమ అమ్మ రూ.10లక్షలు ఇచ్చిందన్నారు. నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో నిలదీయగా రేపు, మాపు అంటూ కాలం వెలిబుచ్చారని చెప్పారు. ఈ క్రమంలోనే తమ తల్లి మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమను మోసగించిన రమణయ్య, సావిత్రిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎస్పీ తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నెల్లూరు రూరల్: గత నెల 9న అల్లీపురంలో జరిగిన ప్రమాదంలో స్పృహతప్పి పడిపోయిన పూడి కమలమ్మ(90) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు రూరల్ పోలీసులు సోమవారం తెలిపారు. వివరాలు.. అల్లీపురంలో చెన్నకేశవస్వామి ఉత్సవాల ఊరేగింపులో ట్రాక్టర్ వెనుకగా కూర్చుని ఉన్న కమలమ్మ ప్రమాదవశాత్తు జారి పడిపోయింది. ఆమెను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మృతి చెందింది. ఈ మేరకు మనుమడు గోపి రూరల్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు ఆస్పత్రికి చేరుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

నెల్లూరు(బారకాసు): నగరంలోని 26వ డివిజన్ పరిధిలోని వేదాయపాళెం పరిసర ప్రాంతాల్లో మేయర్ స్రవంతి సోమవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని పరిశీలించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేయకుండా ఇంటి వద్దకు చెత్త సేకరణ వ్యాన్ వచ్చినప్పుడు అందజేయాలని స్థానికులకు సూచించారు. త్యాగరాజు నగర్‌లో సిమెంట్‌రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరగా,అందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. స్థానిక డివిజన్ కార్పొరేటర్ బూడిద సుప్రజ, డివిజన్ ఇన్‌చార్జి పురుషోత్తం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేత్రదానం



శ్యామలమ్మ(ఫైల్)



విజయవర్మ(ఫైల్)



నరసింహులు(ఫైల్)



ఆదిశేషయ్య(ఫైల్)

నెల్లూరు(అర్బన్): నగరంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన నలుగురు మృతి చెందగా వారి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. బాలాజీనగర్‌కు చెందిన జొన్నవాడ లక్ష్మీనరసింహులు (78), రంగనాయకులపేటకు చెందిన అచ్యుత ఆదిశేషయ్య(75) సోమవారం మృతి చెందారు. నవాబుపేటకు చెందిన రాయపల్లి శ్యామలమ్మ(90) వయోభారంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. అలాగే దర్గామిట్టలోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న ముప్పాల విజయవర్మ (40) గుండెపోటుతో కిమ్స్ ఆస్పత్రిలో మృతి చెందాడు. మృతుల నేత్రాలను కుటుంబ సభ్యుల అంగీకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థకు చెందిన నేత్రదాన మోటివేటర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. మృతుల కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్లు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీసింగ్ మాట్లాడుతూ నేత్రదానం ఎంతో పుణ్యకార్యమన్నారు. నేత్ర దానంతో ఇద్దరి అంధులకు చూపును ప్రసాదించవచ్చని తెలిపారు. నేత్ర దానం చేయదలచినవారు 99481 64781, 93471 11033 నంబర్లలో సంప్రదించాలని కోరారు. నేత్ర దాన మోటివేటర్ వైవీ సుబ్బారావు, చిరంజీవి బ్లడ్ అండ్ ఐ బ్యాంకు ఇన్‌చార్జి సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

మాతృశ్రీ భవన సముదాయం ప్రారంభం

నెల్లూరు(బృందావనం): పుత్తా ఎస్టేట్ సమీపంలోని శ్రీపుష్పగిరి విద్యానృసింహభారతిస్వామి జిల్లా బ్రాహ్మణ భవన సముదాయంలో నూతనంగా నిర్మించిన మాతృశ్రీ భవన సముదాయాన్ని సోమవారం ప్రారంభించారు. గుంటూరుకు చెందిన న్యాయమూర్తి బీ శివశంకరరావు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్రాధ్యక్షుడు ఎస్ వెంకటరామరాజు ముఖ్యఅతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసిన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ వాసుదేవరావు, ఐ కామేశ్వరప్రసాద్ మాట్లాడుతూ జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో పుష్పగిరి విద్యాభారతిస్వామి అనుగ్రహ దాతృత్వంతో మాతృశ్రీ భవనాన్ని నిర్మించినట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య గౌరవాధ్యక్షుడు కేవీ బలరామకృష్ణమూర్తి, రాష్ట్ర సలహాదారుడు గుళ్లపల్లి శివశర్మశ్రౌతి,నెల్లూరు ఆర్డీఓ మలోల రాష్ట్ర, జిల్లా బ్రాహ్మణ సంఘాల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాతృశ్రీ భవనాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ శివశంకరరావు

భవ్యహాసిని నాట్య ప్రదర్శన స్ఫూర్తిదాయకం

నెల్లూరు(బృందావనం): నెల్లూరుకు కళారంగంలో మరింత గుర్తింపు తెచ్చేందుకు చిన్నారి నల్లంగు భవ్యహాసిని చేస్తున్న నిర్విరామ నాట్యప్రదర్శన స్ఫూర్తిదాయకం, అభినందనీయమని నగరపాలక సంస్థ కోఆప్షన్‌సభ్యుడు నూనె మల్లికార్జునయాదవ్ పేర్కొన్నారు. ఈ ఏడాది జూలై 16న అరుణాచలంలో ఐదు గంటల గిరి ప్రదక్షిణ కోసం మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయంలో భవ్యహాసిని నిర్విరామ నాట్యప్రదర్శన సాధనను సోమవారం చేపట్టింది. ఈ ప్రదర్శనను నూనె మల్లికార్జునయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింహపురి ఖ్యాతిని చాటేందుకు భవ్యహాసిని చేస్తున్న ప్రయత్నం పరమేశ్వరుడి కృపతో సఫలీకృతం కావాలని కాంక్షించారు.భవ్యహాసిని పట్టుదల ప్రశంసనీయమన్నారు. అందుకు ప్రోత్సాహాన్ని ఇస్తున్న తల్లిదండ్రులు, నాట్యగురువులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయప్రధాన అర్చకుడు శివస్వామి, చంద్ర, తల్లిదండ్రులు, గురువులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న నూనె మల్లికార్జునయాదవ్

మళ్లీ వచ్చేది పేదల ప్రభుత్వమే



మాట్లాడుతున్న మొయిళ్ల గౌరి

నెల్లూరు(బారకాసు): ఎవరెన్ని కుట్రలు చేసినా, ప్రతిపక్షాలు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా ప్రజల ఆశీస్సులు, దేవుడి చల్లని దీవెనలతో గెలిచేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని..మళ్లీ వచ్చేది పేదల ప్రభుత్వమేనని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి పేర్కొన్నారు. సోమవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. రాజు బలవంతుడు అయినప్పుడే శత్రువులందరూ ఏకం అవుతారని చాణక్యుడు చెప్పిన మాట వాస్తవమని ఈ రోజు నెల్లూరు జిల్లా రాజకీయ పరిస్థితులే చెబుతున్నాయన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా, జగనన్నకు అండగా నిలబడింది జిల్లా ప్రజలు, జెండా మోసిన కార్యకర్తలేనన్నారు. 2014లో జిల్లాలో ఏడు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలిస్తే, 2019లో పది స్థానాల్లో గెలిచిందని గుర్తుచేశారు. జగనన్న నాలుగేళ్ల పాలనలో రోజురోజుకు వైఎస్సార్‌సీపీకి ప్రజాదరణ మరింత పెరిగిందని చెప్పారు. లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయడానికి నలభై సంవత్సరాల రాజకీయ అనుభవం అంటున్న చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యేలే దిక్కయ్యారన్నారు. వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు వెంట నడవడానికి సిద్ధమైన ఎమ్మెల్యేలకు రాజకీయ భవిష్యత్తు ముగిసినట్లేనని జిల్లా ప్రజలు అభిప్రాయపడుతున్నారన్నారు. పేదవారి సంక్షేమం కోసం జగనన్న పోరాటం చేస్తుంటే..పెత్తందారుల కోసం వారికి దోచిపెట్టడానికి ప్రతిపక్షాలు ఏకమవుతున్నాయన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా, ఎంత మంది కలిసిన రాబోయే ఎన్నికల్లో 99శాతం హామీలను నెరవేర్చి గడప వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న పేదల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.